మహిళ పై గొడ్డలితో దాడి : తీవ్రగాయాలు

ధర్పల్లి, ఏప్రిల్ 25 : మండలంలోని గోవింద్‌పల్లి గ్రామానికి చెందిన మహిళపై భూతగాదాల కారణంగా ఓ యువకుడు గొడ్డలితో దాడిచేసిన ఘటన గురువారం చోటు చేసుకున్నది. ఎస్సై విక్రమ్, గ్రామస్తులు తెలిపిన కథనం ప్రకారం.. గోవింద్‌పల్లికి చెందిన గోలేం లతకు, అదే గ్రామానికి చెందిన దొడ్డెనుక గోపికి కొంత కాలంగా భూ తగాదా కొనసాగుతున్నది. లత అన్న రాజేశ్వర్‌ను గతంలో కట్టెతో కొట్టిన విషయంలో గోపీపై కేసు సైతం నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. అప్పటినుంచి ఈ విషయాన్ని మనస్సులో పెట్టుకున్న గోపి.. తరచూ లత కుటుంబంతో గొడవలు పడుతున్నాడని, ఎలాగైనా వీరిని చంపి ఆ భూమిని దక్కించుకుంటానని పలుమార్లు అనేవాడని ఎస్సై పేర్కొన్నారు. లత కుటుంబంతో తనకు ఆస్తి నష్టం వాటిల్లిందని గోపి గోడప్రతులను అతికించాడు. ఈ విషయమై లత, ఆమె భర్త నవీన్, లత తల్లి సుగుణ గ్రామంలోని హోటల్ వద్ద గోపిని ప్రశ్నించగా.. తన వద్ద ఉన్న గొడ్డలితో దాడికి రాగా.. సుగుణ అడ్డువచ్చింది. ఆమె ఛాతి భాగంలో నరకడంతో తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని సుగుణను దవాఖానకు తరలించారు. లత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

జేఈఈ అడ్వాన్స్‌లో ధర్మారం విద్యార్థుల ప్రతిభ

డిచ్‌పల్లి, ఏప్రిల్ 25 : జేఈఈ మెయిన్స్ ఫైనల్ ఫలితాలను గురువారం ప్రకటించగా ధర్మారంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల విద్యార్థినులు ప్రతిభ చూపారని ప్రిన్సిపాల్ సంగీత తెలిపారు. 15 మంది విద్యార్థినులు జేఈఈ అడ్వాన్స్‌కు అర్హత సాధించినట్లు తెలిపారు. బి. వర్ష 92.44, టి. తేజశ్రీ 90.87, ఎన్.కృతఘ్ని 86.76, వై.సంధ్య 85.71, ఎం.అపూర్వ 79.46 శాతంతోపాటు మరో ఆరుగురు విద్యార్థులు మంచి పర్సంటేజ్ సాధించారని పేర్కొన్నారు. విద్యార్థినులను ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

28న 'ఏకలవ్య' ప్రవేశపరీక్ష

ఇందల్వాయి, ఏప్రిల్ 25 : ఇందల్వాయి, గాంధారిలోని ఏకలవ్య ఆదర్శ పాఠశాలల్లో 6వ తరగతిలో ప్రవేశాల కోసం ఈనెల 28న పరీక్ష నిర్వహించనున్నట్లు నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల రీజినల్ కో-ఆర్డినేటర్ సంపత్‌కుమార్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, సోమ్లానాయక్ తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఆన్‌లైన్ నుంచి అడ్మిట్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

బీఆర్ఎస్ బూత్ కమిటీల ఎన్నిక

సల్లగరిగెలో బూత్ లెవల్ కమిటీ సభ్యులకు నియామకపత్రాన్ని అందజేస్తున్న నాయకులు రాజ్‌పాల్‌రెడ్డి, మహిపాల్

ధర్పల్లి/ సారంగపూర్, ఏప్రిల్ 25 : వచ్చే నెల 13న జరగనున్న లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి బీఆర్ఎస్ బూత్ కమిటీలను పలు గ్రామాల్లో గురువారం ఎన్నుకున్నారు. ధర్పల్లి మండలంలోని మైలారం, సల్లగరిగె, బీబీ తండా, దుబ్బాక, రేకులపల్లి, ఎస్‌బీ తండా, దమ్మన్నపేట్ తదితర గ్రామాల్లో కమిటీలను ఎన్నుకున్నారు. బాజిరెడ్డి గోవర్ధన్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సీనియర్ నాయకులు బూత్ కమిటీ సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మహిపాల్ యాదవ్, రైతుబంధు సమితి జిల్లా సభ్యుడు, మండల కన్వీనర్ పీసు రాజ్‌పాల్‌రెడ్డి, సొసైటీ మాజీ చైర్మన్ జీయర్ కిశోర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్ రూరల్ మండలంలోని పాల్దా గ్రామ బీఆర్ఎస్ లోక్‌సభ బూత్ కమిటీని గురువారం నియమించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మధుకర్‌రావు, జడ్పీటీసీ బొల్లెంక సుమలతా గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో బూత్ కమిటీ సభ్యులుగా మున్నూరు ప్రభాకర్, నవీన్, నరేశ్, రాజేందర్, నర్సారెడ్డి, పవన్‌కుమార్, మొగులాజీ ప్రభాకర్, సదానంద్, గంగాధర్‌ను ఎన్నుకున్నారు.

ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

డిచ్‌పల్లి, ఏప్రిల్ 25 : యువత ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ తెలుగు రాష్ట్రాల స్టేట్ డైరెక్టర్ విశ్వనాథరెడ్డి అన్నారు. డిచ్‌పల్లిలోని రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌ను ఆయన గురువారం సందర్శించారు. వసతులపై అభ్యర్థులను అడిగి తెలుసుకున్నారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు ప్రారంభం

ఖలీల్‌వాడి, ఏప్రిల్ 25 : జిల్లాలో ఓపెన్ పది, ఇంటర్ పరీక్షలు గురువారం ప్రారంభమైనట్లు డీఈవో దుర్గాప్రసాద్, ఓపెన్ స్కూల్ కో-ఆర్డినేటర్ తుల రవీందర్ తెలిపారు. మొదటిరోజు తెలుగు పదోతరగతి పరీక్షకు 1017 మంది విద్యార్థులకు 910 మంది హాజరుకాగా.. 107 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. ఇంటర్‌లో 1490 మంది విద్యార్థులకు 1340 మంది హాజరుకాగా 150 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

రాయకూర్‌లో ఎన్ఎస్ఎస్ క్యాంప్

ఎన్ఎస్ఎస్ క్యాంపులో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

రుద్రూర్, ఏప్రిల్ 25 : మండలంలోని రాయకూర్ గ్రామంలో పుడ్‌సైన్స్ రుద్రూర్ కళాశాల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ క్యాంప్‌ను ఎంపీవో సాయిలు, గ్రామపెద్దలు, కళాశాల ఉపాధ్యాయులు గురువారం ప్రారంభించారు. ఏడు రోజుల పాటు క్యాంపును నిర్వహిస్తామని తెలిపారు. విద్యార్థులకు సమాజంపై అవగాహన, స్వయం ఉపాధి నైపుణ్యం పెంచుకోవడం, సమాజంలో బలహీన వర్గాలకు సేవచేయాలనే సంకల్పాన్ని ప్రోత్సహించడం తదితర అంశాలపై అవగాహన కల్పిస్తామని తెలిపారు.

మలేరియా రహిత సమాజమే లక్ష్యం

జిల్లాకేంద్రంలో ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో సుదర్శనం

ఏర్గట్లలో ర్యాలీలో పాల్గొన్న వైద్యారోగ్య సిబ్బంది

ఖలీల్‌వాడి/ ఏర్గట్ల/బాల్కొండ/రెంజల్ / కోటగిరి/ రుద్రూర్/ ధర్పల్లి/ సిరికొండ/ ఇందల్వాయి/ ఆర్మూర్ టౌన్, ఏప్రిల్ 25 : ప్రపంచ మలేరియా నివారణ దినాన్ని పురస్కరించుకొని వైద్యశాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా గురువారం అవగాహన ర్యాలీలు నిర్వహించారు. మలేరియా, డెంగీ, టైఫాయిడ్ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ వైద్యారోగ్య సిబ్బంది ఫ్లెక్సీలతో గ్రామాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు.

జిల్లాకేంద్రంలో వైద్య, ఆరోగ్య శాఖ, జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణ కేంద్రం ఆధ్వర్యంలో వినాయక్‌నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో అవగాహన ర్యాలీని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డీఎంహెచ్‌వో డాక్టర్ సుదర్శనం హాజరై జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. మలేరియా రహిత సమాజమే వైద్యారోగ్య శాఖ లక్ష్యమన్నారు. ర్యాలీ అనంతరం పట్టణ ఆరోగ్య కేంద్రంలో మలేరియాపై అవగాహన సదస్సును నిర్వహించారు. జిల్లాలో గతేడాది నుంచి ఒక్క మలేరియా కేసు కూడా నమోదు కాలేదని తెలిపారు. ప్రతి శుక్రవారం 'ఫ్రైడే-డ్రైడే' నిర్వహించాలని, వైద్యారోగ్య సిబ్బంది వ్యక్తిగత, పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించాలని సూచించారు.

ఏర్గట్ల మండలకేంద్రంలో మలేరియా నివారణపై మండల వైద్యాధికారిణి ప్రసన్నప్రియ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. బాల్కొండ మండలంలోని కిసాన్‌నగర్‌లో పీహెచ్‌సీ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. రెంజల్, నవీపేట మండలాల్లో ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. పొతంగల్‌లో ఆరోగ్య విస్తీర్ణ అధికారి గోవర్ధన్ ఆధ్వర్యంలో, రుద్రూర్‌లో పీహెచ్‌సీ వైద్యాధికారిణి ఆయేషా సిద్ధిఖా ఆధ్వర్యంలో, ధర్పల్లిలో సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు సుశాంత్ ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించారు.

సిరికొండలో మండల వైద్యాధికారి అరవింద్ ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి ర్యాలీ నిర్వహించారు. ఇందల్వాయిలో ఆరోగ్య విస్తీర్ణాధికారి, పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. దోమల ద్వారా కలిగే రోగాలు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆర్మూర్ పట్టణంలోని పెర్కిట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఆర్మూర్ డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేశ్, గోవింద్‌పేట్ ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి మానస అవగాహన కల్పించారు.

సిరికొండలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

రెంజల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

మృతదేహంతో నాలుగు గంటలపాటు ధర్నా

బాధ్యులపై చర్యలు తీసుకోవాలని మృతుడి భార్య, బంధువుల డిమాండ్

మృతదేహంతో ధర్నా నిర్వహిస్తున్న మృతుడి భార్య, బంధువులు

సిరికొండ, ఏప్రిల్ 25 : మండలంలోని గడ్కోల్ గ్రామానికి చెంసిన గుర్రాల రవీందర్ (42) బుధవారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. రవీందర్ ఆత్మహత్యకు అదే గ్రామానికి చెందిన మాల్కి లలిత కారణమని మృతుడి భార్య శ్యామల, బంధువులు ఆరోపించారు. మాల్కి లలిత ఇంటి ఎదుట గురువారం మృతదేహంతో నాలుగు గంటల పాటు నిరసన తెలిపారు. తన భర్తను కొన్ని రోజుల క్రితం మాల్కి లలిత బంధువు, గ్రామానికి చెందిన పలువురు చితకబాదారని, మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి భార్య ఆవేదన వ్యక్తం చేసింది. పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని వదిలేశారని ఆరోపించింది. తన భర్త మృతికి కారణమైన వారిపై కేసు నమోదు చేసి న్యాయం చేయాలని డిమాండ్ చేసింది. నిజామాబాద్ ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని, మృతుడి భార్య, బంధువులతో మాట్లాడి సముదాయించారు. మృతికి కారణమైన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకొని, న్యాయం చేస్తానని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. అనంతరం ఎలాంటి గొడవలూ జరగకుండా పోలీస్ బందోబస్తు మధ్య అంత్యక్రియలు నిర్వహించారు.

ఓటుకు నోటు కేసులో రేవంత్‌కు శిక్ష తప్పదు

- ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు ఎటుపాయె
- విలేకరుల సమావేశంలో ఎంపీ ధర్మపురి అర్వింద్

వినాయక్‌నగర్, ఏప్రిల్ 25 : ఓటుకు నోటు కేసులో రేవంత్‌రెడ్డికి శిక్ష తప్పదని ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. జిల్లాకేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ముస్లిం రిజర్వేషన్ సుప్రీంకోర్టు తీర్పుకు వ్యతిరేకమని అన్నారు. ఆరు గ్యారెంటీల విషయం మాట్లాడమంటే రేవంత్ రెడ్డి పనికి మాలిన డేట్లు ఇస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు ఎటుపాయెనని ప్రశ్నించారు. రైతులు, మహిళలు, యువతకు హామీలు ఇచ్చి మోసం చేశారని, చెరుకు ఫ్యాక్టరీని తెరిపిస్తామని మాయమాటలు చెప్పారని, ధాన్యం కొనుగోలు ప్రక్రియ సరిగ్గా లేదని, రూ. 2 లక్షల రుణమాఫీ ఎటు పాయెనని రేవంత్‌పై ధ్వజమెత్తారు. సమావేశంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి, నాయకులు పల్లె గంగారెడ్డి, జిల్లా, మండల నాయకులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్

బొప్పాపూర్‌లో మెగా వైద్యశిబిరం

వైద్యశిబిరంలో పాల్గొన్న డాక్టర్లు

రుద్రూర్, ఏప్రిల్ 25 : మండలంలోని బొప్పాపూర్‌లో లయన్స్‌క్లబ్ ఆఫ్ రుద్రూర్ ఆధ్వర్యంలో మెగా వైద్యశిబిరాన్ని గురువారం నిర్వహించారు. గ్రేస్ ఫౌండేషన్ సహకారంతో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో 252 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. 51 మ్యామోగ్రామ్, 30 మందికి ప్యాప్స్మియర్ టెస్టులు, 42 మందికి బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించినట్లు వివరించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు నారోజి గంగారాం, లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ వేమూరి లక్ష్మి, కృష్ణ, పట్ల సురేశ్, కుర్మాజి సాయిలు, లచ్చయ్య, హన్మాండ్లు, సంతోష్ పటేల్, డాక్టర్ రవీంద్రనాథ్, సూరి, క్యాంపు కో-ఆర్డినేటర్, వెంకటసాయి, సుబ్బారావు, విమల్, సురేశ్, మైకేల్, రాకేశ్, కల్యాణి, నసీమా, రేవతి, రాజు, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు శ్యాంసుందర్, కోశాధికారి కేవీమోహన్, డాక్టర్ శంకర్ పాల్గొన్నారు.

సప్లిమెంటరీ పరీక్ష ఫీజు చెల్లించాలి

ఖలీల్‌వాడి, ఏప్రిల్ 25 : ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షల కోసం విద్యార్థులు ఫీజును చెల్లించవచ్చని ఇంటర్ విద్యాశాఖ అధికారి రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 24వ తేదీ నుంచి సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం కానున్నాయని, విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా ఫీజు చెల్లించాలని కోరారు. అదేవిధంగా రీ కౌంటింగ్ చేయించుకోవాలనుకునే విద్యార్థులు రూ. 100, రివాల్యుయేషన్‌కు రూ. 600 చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

మాట్లాడుతున్న ఎంపీడీవో వెంకటేశ్వర్

వర్ని, ఏప్రిల్ 24 : ఎండలు తీవ్రంగా ఉన్నాయని, నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వర్ని ఎంపీడీవో వెంకటేశ్వర్ పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందికి సూచించారు. ఎంపీడీవో కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన పనులను పర్యవేక్షించాలని అన్నారు. సమావేశంలో ఎంపీవో చందర్ తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్ సెంటర్‌ను పరిశీలించిన జనరల్ అబ్జర్వర్

సీఎంసీ కళాశాలలో కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకురాలు ఎలిస్ వజ్ ఆర్

ఖలీల్‌వాడి, ఏప్రిల్ 25 : డిచ్‌పల్లి మండలంలోని సీఎంసీ కళాశాలలో లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్ కేంద్రాన్ని నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గ సాధారణ ఎన్నికల పరిశీలకురాలు ఎలిస్ వజ్ ఆర్ గురువారం పరిశీలించారు. నిజామాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్‌లోని నిజామాబాద్ అర్బన్, రూరల్, బోధన్, ఆర్మూర్, బాల్కొండ, జగిత్యాల్, కోరుట్ల అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో పోల్ అయ్యే ఓట్ల లెక్కింపుతోపాటు నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్ అసెంబ్లీ సెగ్మెంట్లకు సంబంధించిన ఎన్నికల సామగ్రి పంపిణీ, స్వీకరణ సీఎంసీలోనే చేపట్టనున్నారని అధికారులు అబ్జర్వర్ దృష్టికి తెచ్చారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియకు ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పర్యవేక్షణలో అన్ని చర్యలు తీసుకుంటున్నామని అధికారులు అబ్జర్వర్‌కు తెలిపారు. ఆమె వెంట జిల్లా కార్మికశాఖ అధికారి యోహాన్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రమేశ్, మెప్మా పీడీ రాజేందర్, విజయేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

'ఉపాధి' పనుల్లో అక్రమాలకు పాల్పడితే సహించేది లేదు

- డీఆర్డీవో సాయాగౌడ్ హెచ్చరిక

రికార్డులను పరిశీలిస్తున్న డీఆర్డీవో సాయాగౌడ్

సారంగాపూర్, ఏప్రిల్ 25 : ఉపాధిహామీ పథకంలో అక్రమాలకు పాల్పడితే సహించేది లేదని డీఆర్డీవో సాయాగౌడ్ హెచ్చరించారు. రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మల్లేశ్ అధ్యక్షతన గురువారం నిర్వహించిన ఉపాధిహామీ సామాజిక తనిఖీ మండల స్థాయి ప్రజావేదిక కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఉపాధి హామీ కూలీల జాబ్‌కార్డులను వెంటనే అప్‌గ్రేడ్ చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో చేపట్టనున్న పనులకు సంబంధించిన నివేదికలు తయారుచేసి కార్యాలయానికి పంపించాలని సూచించారు. సామాజిక తనిఖీ కార్యకర్తలు గ్రామాల వారీగా చేపట్టిన సోషల్ ఆడిట్ పనుల నివేదికలను డీఆర్పీలు చదివి వినిపించారు. కార్యక్రమంలో ఈజీఎస్ రాష్ట్ర ప్రోగ్రాం మేనేజర్ అశోక్‌కుమార్, ఎస్ఆర్పీ భగవంత్‌రావు, జిల్లా విజిలెన్స్ అధికారి నారాయణ, అంబుడ్స్‌మెన్, శ్రీనివాస్‌రావు, ఎంపీడీవో మల్లేశ్, ఏపీవో పద్మ, పంచాయతీ కార్యదర్శులు, సోషల్ ఆడిట్ ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

- **కొనసాగుతున్న బీఎడ్ పరీక్షలు** - డిచ్‌పల్లి, ఏప్రిల్ 25 : టీయూ పరిధిలో బీఎడ్ మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు కొనసాగుతున్నాయి. ఏడో రోజైన గురువారం నిర్వహించిన పరీక్షలకు 412 మంది విద్యార్థులకు 388 మంది విద్యార్థులు హాజరైనట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ గంటా చంద్రశేఖర్ తెలిపారు.
- **జాబ్‌కార్డు ఉన్నవారు ఉపాధి పనులకు హాజరయ్యేలా చూడాలి** - ధర్పల్లి, ఏప్రిల్ 25 : జాబ్‌కార్డు ఉన్నవారు ఉపాధి పనులకు హాజరయ్యేలా చూడాలని ఎంపీడీవో బాలకృష్ణ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఈజీఎస్ సిబ్బందితో గురువారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున పనిప్రదేశంలో తాగునీరు, టెంట్ సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. నర్సరీల్లో నాటేందుకు మొక్కలను సిద్ధం చేయాలని సూచించారు. సమావేశంలో ఏపీవో వినోద, ఈజీఎస్ ఈసీ, సిబ్బంది పాల్గొన్నారు.
- **చందూర్‌లో గ్రామసభ** - చందూర్, ఏప్రిల్ 25 : మండలకేంద్రంలో ఎంపీవో తారాచంద్ అధ్యక్షతన గురువారం గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో తాగునీరు, వీధిదీపాలు, శానిటేషన్, ఉపాధి హామీ పనులపై గ్రామస్తులు, అధికారులు చర్చించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దశాగౌడ్, ఎంపీవో తారాచంద్, కార్యదర్శి సాయిలు, గ్రామపెద్దలు రాంరెడ్డి, శేఖర్, శ్రీనివాస్, శ్రీకాంత్, గ్రామస్తులు పాల్గొన్నారు.
- **ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్టు** - వినాయక్‌నగర్, ఏప్రిల్ 25 : నగరంలోని త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పేకాడుతున్నారన్న సమాచారంతో ఎస్సై ప్రవీణ్ సిబ్బందితో కలిసి గురువారం పేకాటస్థావరంపై దాడి చేశారు. నాందేవ్‌వాడలోని ఓ ఇంట్లో దాసి చేసి పేకాడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నామని, వారి నుంచి రూ.58,430 నగదును స్వాధీనం చేసున్నామని తెలిపారు. పట్టుబడిన వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎక్కడైనా పేకాడితే తమకు సమాచారం అందించాలని ఎస్సై కోరారు.
- **మేడే పోస్టర్ల ఆవిష్కరణ** - డిచ్‌పల్లి, ఏప్రిల్ 25 : టీయూ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ అనుబంధ) ఆధ్వర్యంలో టీయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట మేడే పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. బీజేపీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటం చేయాలని యూనియన్ ప్రధాన కార్యదర్శి బికోజి కోరారు. కార్యక్రమంలో వైస్‌ప్రెసిడెంట్ మధుళిక, సభ్యులు సుధీర్, డాక్టర్ రవీందర్‌నాయక్, రమేశ్ గులాబ్, గంగాధర్, జమునా రాణి, భవానీశ్యాం పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

LOST DOCUMENTS

★I, KUMMARI SIDDAVVA W/o KUMMARI LAXMI KANTHAM R/o. H.No.1-76, Lingampally Kurdhu (V), Lingampet (M), Kamareddy (Dist.) I lost the Org Registration Document 455/2018, SRO Yellareddy. While I'm travelling from Gandhari To Lingampet. If anybody Found Please Call:9502336604.

NTZ-324680

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే, ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఓటర్ స్లిప్పుల పంపిణీ ప్రారంభం

ఓటర్ స్లిప్పులను అందిస్తున్న తహసీల్దార్ ఎంఏ ఖలీం

రెంజల్, ఏప్రిల్ 25: ఎంపీ ఎన్నికల్లో భాగంగా మండలంలో ఓటర్ స్లిప్పుల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం మండల కేంద్రంలో ప్రారంభించినట్లు తహసీల్దార్ ఎంఏ ఖలీం తెలిపారు. మండలంలో 29,367 మంది ఓటర్లు ఉండగా, అందులో పురుషులు 14,364, మంది, స్త్రీలు 16,292 మంది, థర్డ్ జెండర్ ఒకరు ఉన్నట్లు తెలిపారు. వచ్చే నెలలో నిర్వహించనున్న పార్లమెంట్ ఎన్నికల కోసం సమీప అంగన్‌వాడీ టీచర్లు ఓటరు స్లిప్పులను ఇంటింటికీ తిరుగుతూ అందిస్తారని తెలిపారు. ఓటర్లు తమ ఓటు హక్కును తప్పకుండా సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సూచించారు. అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

అంతర్రాష్ట్ర సరిహద్దులో వాహనాల తనిఖీ

రెంజల్, ఏప్రిల్ 25: మండలంలోని కందకుర్తి సరిహద్దులో ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర చెక్ పోస్టు వద్ద గురువారం ఎస్సై సాయన్న వాహనాలను తనిఖీ చేశారు. వచ్చే నెలలో నిర్వహించనున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మహారాష్ట్ర వైపు నుంచి మద్యం, నగదు, ఇతర నిషేధిత వస్తువులు రాష్ట్రంలోకి తరలించకుండా అన్ని శాఖల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్సై తెలిపారు.

నేడు ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి ప్రచారం

మోర్తాడ్/బాల్కొండ, ఏప్రిల్ 25: మోర్తాడ్ మండలంలోని పాలెం గ్రామంలో శుక్రవారం ఉదయం 7 గంటలకు ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ తరపున ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కల్లెడ ఏలియా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధి హామీ కూలీలను కలిసి వారితో మాట్లాడుతారని తెలిపారు. అనంతరం కార్యకర్తలను కలిసి ఎంపీ ఎన్నికల విషయంలో చర్చిస్తారని, నాయకులు, కార్యకర్తలు సకాలంలో హాజరుకావాలని కోరారు. బాల్కొండ మండలంలోని పన్నెల్(బి) గ్రామంలో ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ తరపున ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. రాత్రి 7 గంటలకు కిసాన్‌నగర్ గ్రామంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారన్నారు.

'మాదిగలు బీజేపీకి ఓటు వేయ్యొద్దు'

మాక్లూర్, ఏప్రిల్25: పార్లమెంట్ ఎన్నికల్లో మాదిగలు బీజేపీకి ఓటు వేయవద్దని మాదిగ సంఘాల యునైటెడ్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొక్కెర భూమన్న అన్నారు. సోమవారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎస్సీ వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చి మరిచి పోయారని అన్నారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో వర్గీకరణ చేస్తానని పదేండ్ల క్రితం హామీ ఇచ్చి దానిని అమలు చేయలేదని మండిపడ్డారు. మాదిగలు మళ్లీ ఆపార్టీకి ఓటు వేసి మోసపోవద్దని కోరారు. సమావేశంల